క్లుప్తంగా

వైఎస్ జగన్‌ను కలసిన వేణురెడ్డి



బెంగళూరు ఎయిర్‌పోర్టులో మాజీ సీఎం వైఎస్ జగన్‌తో వేణురెడ్డి

చిలమత్తూరు: వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు వేణురెడ్డి మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సోమవారం బెంగళూరు ఎయిర్‌పోర్ట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలని వైఎస్ జగన్ సూచించినట్లు వేణురెడ్డి 'సాక్షి'కి తెలిపారు. పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలని తెలియజేశారన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్‌ను కలసిన నాయకులు

అమరాపురం: రాష్ట్ర కుంచిటి వక్కలిగ వైఎస్సార్‌సీపీ విభాగం ఉపాధ్యక్షుడు హలుకూరు కాంతరాజు తదితరులు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్‌ను బెంగళూరులో మర్యాదపూర్వకంగా కలిశారు. మడకశిర నియోజకవర్గంలో పార్టీ పరిస్థితులను అడిగి తెలుసుకోవడంతో పాటు పార్టీ బలోపేతానికి చర్యలు తీసుకోవాలని సూచించినట్లు కాంతరాజు తెలిపారు. కష్టపడి పని చేసే వారికి పార్టీలో సముచిత స్థానం ఉంటుందని భరోసా ఇచ్చారన్నారు. ఉషశ్రీచరణ్‌ను కలసిన వారిలో సర్పంచ్ నటరాజు, నాయకులు మంజునాథ, దొడ్డేగౌడ, చేతన్, పవన్, రంగనాథ, సురేష్, చిదానందగౌడ తదితరులు ఉన్నారు.

విద్యార్థిపై ఫిర్యాదు

పెనుకొండ: పట్టణానికి చెందిన చెరువు రోడ్డులోని ఓ విద్యార్థిపై మడకశిర నియోజకవర్గం ఆముదాల గొంది మాజీ సర్పంచ్ నాగరాజు సోమవారం పెనుకొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణంలోని చెరువు రోడ్డుకు చెందిన విద్యార్థి ఇటీవల ద్విచక్ర వాహనంలో వేగంగా వచ్చి మాజీ సర్పంచ్‌ను ఢీకొనడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. ఆపరేషన్ కోసం సుమారు రూ. 3 లక్షలు వెచ్చించానని నాగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్ బిల్లుల కోసం పెనుకొండ పీఆర్ ఆఫీస్ వద్దకు వచ్చిన సందర్భంగా తనను విద్యార్థి ద్విచక్ర వాహనంలో వేగంగా వచ్చి ఢీకొనడంతో ప్రమాదం జరిగిందన్నారు. ఎస్‌ఐ వెంటనే విద్యార్థి కుటుంబ సభ్యులను వెంటనే స్టేషన్‌కు పిలిపించారు.

ఆర్‌ఓ ప్లాంటు ప్రారంభం



పాఠశాలలో ఆర్‌ఓ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

అమరాపురం: సాహితీ గగన్ మహల్ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాంటును ఆ సంస్థ అధ్యక్షుడు, న్యాయవాది జె.ప్రతాప్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కల్పించడమే తమ సంస్థ ఉద్దేశమన్నారు. హెచ్‌ఎం. రవీంద్ర మాట్లాడుతూ ఆర్వో ప్లాంటు ద్వారా విద్యార్థులకు మంచి నీటిని అందించడం అభినందనీయమన్నారు.

ఎక్సైజ్‌స్టేషన్ తనిఖీ

పెనుకొండ రూరల్: పట్టణంలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌ను ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే మద్యం విక్రయాలు జరిగేలా చూడాలని ఆదేశించారు.

వారాహిదేవిగా సప్తమాతృక అమ్మవారు



పరిగి: మండల కేంద్రంలోని సప్తమాతృక ఆలయంలో ఆషాడ గుప్త నవరాత్రుల ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. సోమవారం ఉదయం నుంచే ఆలయ ప్రధాన అర్చకులు ప్రవీణ్‌కుమార్, శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సప్తమాత్రుక అమ్మవారిని వారాహీదేవిగా అలంకరించారు. పూర్ణాహుతితో పాటు మహామంగళహారతి ఇచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

అస్తవ్యస్తంగా వీధిలైట్ల నిర్వహణ

- నిరంతరం వెలుగుతూనే ఉన్న బల్బులు
- ప్రతినెలా రూ.లక్షల్లో విద్యుత్ బిల్లులు
- పట్టించుకోని సంబంధితశాఖ అధికారులు
- కొన్ని గ్రామాల్లో చీకట్లు కమ్ముకున్నా ఎవరికీ పట్టని వైనం

రొళ్ల: గ్రామాల్లో వీధిలైట్ల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. దీంతో నియోజకవర్గంలోని చాలా గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ లైట్లు నిరంతరం వెలుగుతూనే ఉన్నాయి. పట్టించుకోవాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో విద్యుత్ బిల్లులు తడిసి మోపెడవుతున్నాయి.

ప్రైవేటు సంస్థతో ఒప్పందం

2016లో అధికారంలో ఉన్న అప్పటి టీడీపీ ప్రభుత్వం అన్ని గ్రామాల్లోని వీధిలైట్ల ఏర్పాటుకు ఈఈఎస్‌ఎల్ అనే ప్రైవేటు సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. రొళ్ల మండలంలోని పది పంచాయతీలు కలిపి మొత్తం 3,861 ఎల్‌ఈడీ బల్బులను అమర్చారు. దీంతో ఒక్కొక్క బల్బుకు 14వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా పంచాయతీశాఖ ద్వారా ప్రతి మూడు నెలలకోసారి రూ.150 చొప్పున మొత్తం రూ.5,79,150 చెల్లించాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు.



టీడీ పల్లి గ్రామంలో పగటి సమయంలో వెలుగుతున్న వీధిలైట్లు

ఇలా పది సంవత్సరాలు అంటే 2026 వరకూ నిర్వహణ బాధ్యలు ఈఈఎస్ఎల్ సంస్థ తీసుకుంది.

చేతులెత్తేసిన అధికారులు

రొళ్ల మండల వ్యాప్తంగా పది పంచాయతీల్లో ఎక్కడా ఆన్ అండ్ ఆఫ్ స్విచ్ బోర్డును ఏర్పాటు చేయలేదు. రాత్రి వీధిలైట్లు నిరంతరం వెలుగుతూనే ఉన్నాయి. ఒక్కొక్క స్విచ్ బోర్డు ఏర్పాటు కోసం రూ.400 నుంచి రూ.650 వరకూ సబ్ లీజ్ ఇచ్చారు. అయితే వారికి కూడా గిట్టుబాటు కావడం లేదని ఎవరూ పట్టించుకోలేదు. కొన్ని గ్రామాల్లో మాత్రం పంచాయతీశాఖ అధికారులు నామమాత్రంగా స్విచ్ బోర్డులు ఏర్పాటు చేసి చేతులెత్తేశారు. జిల్లా ఉన్నతాధికారులు పంచాయతీ అధికారులే స్విచ్ బోర్డులు ఏర్పాటు చేసి బల్బులు ఆన్ అండ్ ఆఫ్ అయ్యే విధంగా చూడాలని ఉత్తర్వులు ఇచ్చి ఏళ్లు గడుతున్న కూడా అధికారులు మాత్రం పట్టించుకోలేదు. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో ప్రతినెలా కరెంటు బిల్లులు రూ.లక్షల్లో చెల్లించాల్సి వస్తోంది. మరోవైపు చాలా గ్రామాల్లో ఎల్‌ఈడీ బల్బులు లేకపోవడంతో చీకట్లు కమ్ముకున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

స్విచ్ బోర్డులు ఏర్పాటు చేయాలి



గ్రామాల్లో అమర్చిన ఎల్ ఈడీ వీధిలైట్లకు నేటికీ ఆన్ అండ్ ఆఫ్ స్విచ్ బోర్డులను ఏర్పాటు చేయలేదు. అమర్చిన బల్బులు రాత్రి, పగలు నిరంతరాయంగా వెలుగుతూనే ఉంటాయి. పగటి సమయంలో విద్యుత్ బల్బులు వెలుగుతుండటం వలన ప్రజలపై ఆర్థిక భారం పడుతోంది. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని స్విచ్‌బోర్డులు ఏర్పాటు చేయాలి.

– రాజు, కాకి, రొళ్ల మండలం

ప్రజలపైనే భారం



మా గ్రామం చుట్టూ పూర్తిగా అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. వీధి లైట్లు ఏర్పాటు చేశారు. అవి నిరంతం వెలుగుతూనే ఉంటాయి. దీని వల్ల ప్రజలపై భారం పడుతోంది. ఆన్‌అండ్ ఆఫ్ స్విచ్ బోర్డు ఏర్పాటు చేయాలి. సంబంధితశాఖ అధికారులు వీధి దీపాలకు బోర్డు ఏర్పాటు చేసి విద్యుత్ ఆదాకు చర్యలు తీసుకోవాలి.

– నాగరాజు, టీడీ పల్లి గ్రామం, రొళ్ల మండలం

నివేదికలు పంపుతాం

మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో వీధిదీపాల కోసం ప్రత్యేకంగా బోర్డులు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటాము. ప్రస్తుతం బోర్డుల ఏర్పాటు చేయకపోవడంతో రాత్రి, పగలు నిరంతం లైట్లు వెలుగుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. స్విచ్ బోర్డులు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వానికి నివేదికలు తయారు చేసి పంపుతాము. మంజూరైన వెంటనే ఆన్‌అండ్‌ఆఫ్ స్విచ్ బోర్డులు ఏర్పాటు చేస్తాం.

– శ్రీనాథ్, ఇన్‌చార్జ్ ఈఓఆర్డీ, రొళ్ల

వాడీవేడిగా 'పురం' కౌన్సిల్ మీట్



కౌన్సిల్‌మీట్‌లో అధికార పక్షాన్ని నిలదీస్తున్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు

- అక్రమాలపై నిలదీసిన వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు
- నీళ్లు నమిలిన ఛైర్మన్, అధికారులు

చిలమత్తూరు: హిందూపురం మున్సిపాలిటీలో అవినీతి అక్రమాలకు పాల్పడి సొంత జేబులు నింపుకునే కాంట్రాక్టర్లను ఎలా ప్రోత్సహిస్తారని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు కౌన్సిల్ సమావేశంలో ఛైర్మన్ రమేష్‌ను ప్రశ్నించారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఛైర్మన్ రమేష్ అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ మీట్ వాడీవేడిగా జరిగింది. వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు మున్సిపాలిటీలో జరిగిన అవినీతి, అక్రమాలపై ప్రశ్నించారు. డిసెల్టేషన్ పనుల్లో జరిగిన అవకతవకలు, కాంట్రాక్టర్ ప్రభాకర్ అవినీతిపై నిలదీశారు. కౌన్సిలర్ వెంకటనాగేంద్రబాబు మాట్లాడుతూ నెలకోసారి కౌన్సిల్ సమావేశాలు నిర్వహించాల్సి ఉన్నా సమావేశాలు ఎందుకు నిర్వహించడం లేదో చెప్పాలన్నారు. వైఎస్సార్‌సీపీ ఫ్లోర్‌లీడర్ ఆసిఫుల్లా మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ గెలుపొందిన వార్డుల్లో టీడీపీ ఇన్‌చార్జ్‌ల పెత్తనం ఎక్కువైందన్నారు. అధికారం ఉంది కదా అని ప్రతి దాంట్లో వేలు పెట్టడం ఏంటని ప్రశ్నించారు. కౌన్సిలర్ ఎన్‌పీ శివ మాట్లాడుతూ గత మున్సిపల్ కమిషనర్ నిబంధనలకు పాతరేసి రూ.కోటిపైగా చెక్కులను డ్రా చేశారని, ప్రజాధనాన్ని ఎవరికి దోచిపెట్టారో చెప్పాలన్నారు. వరుస ప్రశ్నలతో ఛైర్మన్‌తో పాటు అధికారులూ నీళ్లు నమిలారు. డ్రైనేజీలపై ఏర్పాటు చేసే పుష్‌కార్ట్స్ మరమ్మతుకు రూ.10 లక్షలు ఖర్చు పెట్టారని, ఆ డబ్బుతో కొత్త వాటినే కొనుగోలు చేయొచ్చన్నారు. ఎయిర్‌టెల్, జియో సంస్థలతో రిస్టోరేషన్‌లో భాగంగా మట్టి రోడ్డులకు సీసీ రోడ్డులుగా పేర్కొని అక్రమాలకు తెరలేపారన్నారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ బలరామిరెడ్డి మాట్లాడుతూ నింకంపల్లి రోడ్డులో యువత గంజాయి మత్తులో అటుగా వెళ్లే మహిళలతో అనుచితంగా ప్రవర్తిస్తున్నారన్నారు. కౌన్సిలర్ మల్లికార్జున మాట్లాడుతూ సింగిల్ టెండర్లు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. చిన్న పనులు చేయలేక చేతులెత్తేసిన కాంట్రాక్టర్ ప్రభాకర్‌కు మళ్లీ రూ. 63 లక్షలు పనులు కల్పించడం ఏంటని ప్రశ్నించారు. కౌన్సిలర్ రోషన్ అలీ మాట్లాడుతూ తమ వార్డులోని ఎస్‌బీఐ బ్యాంకు వద్ద మురుగునీటి కాలువల్లో మురుగు పేరుకుపోయిందన్నారు. రూ.16 లక్షలతో టెండర్లు ప్రక్రియ పూర్తి కాగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ టెండర్లను రద్దు చేశారన్నారు. ఆ సమస్య మరింత ఎక్కువైందన్నారు. వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు లేవనెత్తిన అంశాలపై విచారణ చేపడతామని కమిషనర్ మల్లికార్జున పేర్కొన్నారు. వైస్ ఛైర్మన్ జబీవుల్లా, కౌన్సిలర్లు షాజియా తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కౌన్సిలర్ల ఓవరాక్షన్

వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు ప్రశ్నోత్తరాల సమయంలో మాట్లాడుతుండగా టీడీపీ కౌన్సిలర్ రఘు, సతీష్ ప్రతి అంశంలోనూ అడ్డుతగిలారు. మీడియాకు అన్ని విషయాలు తెలుస్తాయన్న భయం వారిలో కనిపించింది. వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లే లక్ష్యంగా వారు ఓవరాక్షన్ చేయడం, ఛైర్మన్ వారిని కనీసం వారించకపోవడం చర్చనీయాంశమైంది.

తహసీల్దార్లుగా బాధ్యతల స్వీకరణ



స్వాతి



శ్రీధర్

పెనుకొండ రూరల్: పెనుకొండ నూతన తహసీల్దార్‌గా కే.స్వాతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీల్లో భాగంగా పుట్టపర్తి ఆర్డీఓ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న స్వాతి పెనుకొండ ఎఫ్ఏసీ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు.

గుడిబండ: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నూతన రెగ్యూలర్ తహసీల్దార్‌గా కె.శ్రీధర్ బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం రెగ్యూలర్ తహసీల్దార్ కరుణాకర్ ఇటీవల బదిలీ అయి మడకశిరలో పదవీ విరమణ పొందారు. దీంతో పెనుకొండ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌గా పని చేస్తూ గుడిబండ మండలానికి బదిలీపై శ్రీధర్ వచ్చారు. రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని శ్రీధర్ పేర్కొన్నారు.

'కూటమి'పై ప్రజల్లో వ్యతిరేకత

అగళి: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ఆర్భాటాలు తప్ప ప్రజలకు చేసింది శూన్యం. అందువల్లే ప్రజల్లో వ్యతిరేకత అంతంతకూ పెరుగుతోంది అని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలందరూ సమష్టిగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. మండల పరిధిలోని అలూడిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు తిమ్మరాజు కుమారుడి నామకరణం శుభకార్యంలో పాల్గొన్నారు. అనంతరం స్థానిక నాయకులతో సమావేశమయ్యారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌కు ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకనే చంద్రబాబు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై కేసులు పెట్టిస్తున్నారన్నారు.

స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

పెనుకొండ రూరల్: సోమందేపల్లిలో ప్రభుత్వం తనకు కేటాయించిన 905 నంబర్ పట్టా భూమిని అక్రమార్కులు ఆక్రమించారని, న్యాయం చేయాలని లక్ష్మీదేవి అనే దివ్యాంగురాలు ఆర్డీఓ ఆనంద్‌కుమార్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన ఆర్డీఓ సమస్యను తక్షణం పరిష్కరించాలని తహసీల్దార్ కార్యాలయానికి ఆదేశాలు జారీ చేశారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి ఆక్రమణలో ఉన్న ఇంటి స్థలాన్ని లక్ష్మీదేవికి కేటాయించారు.

ప్రజా సమస్యలపై పోరాడదాం



వైఎస్సార్‌సీపీ శ్రేణుల సమావేశంలో మాట్లాడుతున్న కన్వీనర్ నరసింహమూర్తి

పరిగి: ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి ప్రజా సమస్యలపై పోరాడదామని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మండలంలోని శీగిపల్లిలో సోమవారం ఆయన వైఎస్సార్‌సీపీ శ్రేణులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. సూపర్ సిక్స్ అంటూ డకౌట్ అయిన కూటమి ప్రభుత్వ వైఖరిని ప్రజల్లో ఎండగట్టాలని సూచించారు.

నేడు రీకాలింగ్ పోస్టర్ల విడుదల

మండల కేంద్రమైన పరిగిలో మంగళవారం రీకాలింగ్ చంద్రబాబు కార్యక్రమ పోస్టర్ల విడుదల చేయనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి తెలిపారు. స్థానిక బీరప్ప ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు.

ఉత్తమ సేవలతోనే గుర్తింపు



హిందూపురం: జూనియర్ అసిస్టెంట్ పద్మనాభం దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

హిందూపురం: ప్రభుత్వ ఉద్యోగులు తమవిధి నిర్వాహణలో ఉత్తమ సేవలు అందిస్తే అందరి మన్ననలు పొందగలుగుతారని జిల్లా అదనపు జడ్జి కంపల్లి శైలజ, సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు నాయక్, ప్రత్యేక మెజిస్ట్రేట్ రమణయ్య పేర్కొన్నారు. సోమవారం స్థానిక ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి న్యాయస్థానంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పద్మనాభం పదవీ విరమణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మనాభం సేవలను కొనియాడారు.

అమరాపురం: మండల రీసోర్స్ భవనంలో కాచికుంట, కొర్రేవు, కె.శివరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంలుగా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన అశ్వత్తనారాయణ, బోయ బాబయ్య, లక్ష్మీనారాయణలను సోమవారం ఎంఈఓలు రాఘవయ్య, శ్రీధర్ తదితరులు ఘనంగా సత్కరించారు.

హిందూపురం టౌన్: పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో హిందీ అధ్యాపకురాలు యశోదాదేవి ఉద్యోగ విరమణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె సేవలను ప్రిన్సిపాల్ ప్రగతి తదితరులు కొనియాడారు.

సోమందేపల్లి: మండలంలోని ఈదుళబలాపురంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు దేవమణి సోమవారం పదవీ విరమణ చేశారు. ఎంఈఓ ఆంజనేయులు నాయక్, హెచ్‌ఎం శ్రీధర్‌రావు తదితరులు ఆమెను సన్మానించారు.

అగళి: మండల పరిషత్ కార్యాలయంలో పదవీ విరమణ చేసిన ఎంపీడీఓ యాదవేంద్రను ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వక్తలు ఆయన సేవలను కొనియాడారు.

మడకశిర: మడకశిర తహసీల్దార్‌గా పని చేస్తున్న కరుణాకర్, జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో సీనియర్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న మురళీకృష్ణ ఉద్యోగ విరమణ చేశారు. ఈసందర్భంగా వేర్వేరుగా వారిని ఆశాఖ ఉద్యోగులు ఘనంగా సన్మానించారు.

లేపాక్షి: మండలంలోని కల్లూరు, శిరివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తూ పదవి విరమణ పొందిన ఉపాధ్యాయులు కే.శివారెడ్డి, శశికళను ఎంఈఓలు నాగరాజు, కుళ్లాయప్పతో పాటు ఉపాధ్యాయ బృందం సత్కరించింది.

మడకశిరరూరల్: మండల పరిధిలోని మణూరు ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసులు సోమవారం పదవీ విరమణ చేయగా ఎంఈఓలు భాస్కర్, నరసింహమూర్తి తదితరులు సన్మానించారు. ఆయన సేవలను కొనియాడారు.

రొళ్ల: రత్నగిరి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ కృష్ణమూర్తి సోమవారం పదవి విరమణ పొందారు. దీంతో ఖాతాదారులు, బ్యాంకు ఉద్యోగులు ఆయన సేవలను కొనియాడి సన్మానించారు.

















